క్లుప్తంగా

రైతుబంధు దరఖాస్తుల స్వీకరణ

అలంపూర్ రూరల్: పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం రైతుల నుంచి రైతుబంధు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. చివరి రోజు కావడంతో 50 మంది రైతులు దరఖాస్తులు అందజేశారని ఏఈఓ అనిత తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 200 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అనిత పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

అలంపూర రూరల్: హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉంచుతామని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. సోమవారం మండలంలోని శింగవరం-1, శింగవరం-2, ర్యాలంపాడ్‌లో గ్రామాలలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. కులవృత్తులకు ప్రభుత్వం అందజేయనున్న రూ.లక్ష రుణం దరఖాస్తుల చేసుకున్న అభ్యర్థుల స్థితిగతులను తెలుసుకున్నారు. అలాగే గ్రామాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నారు. మొక్కలు నాటేందుకు సరిపడ గుంతలను తీయాలని, మొక్కలు పాడైపోయిన స్థానాలలో కొత్త మొక్కలను నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. అదేవిధంగా యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఐఎంలో చేరికలు

గద్వాల అర్బన్: కేటీదొడ్డి మండలానికి చెందిన 50 మంది సోమవారం ఎంఐఎం పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్నాబాషా మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కోసం పనిచేస్తుదన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.

కేజీబీవీలలో సీట్ల సంఖ్యను పెంచాలి

గద్వాల: జిల్లాలోని 12 మండలాలలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య కోరారు. సోమవారం జీసీడీఓ ఫర్జానాబేగంకు ఆయన వినతిపత్రం అందజేశారు. కేజీబీవీలలో నాణ్యమైన విద్య అందుతుందని దీంతో పోటీ పెరిగిందని వివరించారు. ఈమేరకు బాలికల విద్యను దృష్టిలో ఉంచుకుని సీట్ల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

తక్కువ బరువు ఉన్న పిల్లలపై శ్రద్ధ

మానవపాడు: మండల కేంద్రంతో పాటు ఉండవెల్లి, మానవపాడు మండలాల అంగన్‌వాడీ టీచర్లతో సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆస్మా మాట్లాడారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ అందించాలన్నారు. ప్రతి కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అయిజ: జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల భూంపురం విద్యార్థులు ఇంటర్‌నేషనల్ సీరీస్‌లో ప్రతిభ కనబరచారు. దీంతో గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ముఖ్య అనుచరుడు క్రీడాభిమాని నరసింహారెడ్డి సోమవారం విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. యూత్ గేమ్స్ నేషనల్ చాంపియన్‌లో బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.30 వేలు ఆర్థికసాయం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయులు, దుబ్బన్న, బసవరాజు, వైఎస్ రామాంజనేయులుగౌడ్, వీరేష్, రాకేష్, గోవిందు, రామేశ్వరి, మానస, ఉమ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రోచర్స్ విడుదల

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన బ్రోచర్స్‌ను సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విడుదల చేశారు. దోస్త్ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో సైన్స్ గ్రూపును ఉన్నత విద్యాశాఖ నిలిపివేసింది. ఈ విషయం కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్పందించి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాకిటి కరుణశ్రీతో మాట్లాడి కళాశాలలో సైన్స్ గ్రూప్స్‌ను తిరిగి కొనసాగించే విధంగా కృషి చేశారు. దీంతో ఈ ఏడాది కళాశాలలో యాధావిధిగా సైన్స్ గ్రూప్స్ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు.


ఉండవెల్లిలో..


జూలెకల్ సాయిబాబా మందిరంలో..


ఆదిశిలాక్షేత్రంలో..

వైభవంగా గురు పౌర్ణమి

● భక్తులతో ఆలయాలు కిటకిట


గద్వాలలో కల్యాణోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

గద్వాల: ఆషాడ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం నదిఅగ్రహారంలో కల్యాణ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా దేవతామూర్తులను పూజించి పుణ్యాహవాచనం నిర్వహించి కన్యాదానం కొనసాగించారు. మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా మాంగల్యధారణ చేశారు. కల్యాణ మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్లకు పండితులు సాంప్రదాయ బద్ధంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోవిందనామ స్మరణ మార్మోగింది. కల్యాణం తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు.

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల దత్తాత్రేయ క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించారు. ఓం సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై అంటూ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, పాండురంగారావు, అర్చకులు ఆంజనేయ శర్మ, సుర్జి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు చేపట్టారు. అంతకు ముందు స్వామి వారి ఉత్సవమూర్తులను భాజాభజంత్రీలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, సురేందర్‌రెడ్డి, రమ్య, డాక్టర్ వైభవ్, కీర్తి, కేశవకుమార్, లక్ష్మి, అర్చకులు చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. డీఎస్పీ రంగ స్వామి, ఎస్ఐ నరేష్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సాయిబాబా నామస్మరణ మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భోజన వసతి కల్పించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలోని షిరిడిసాయి మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహానికి పంచామృతాభిషేకం, సాయి అష్టకం పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి శాంతినగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చీరా సారే ఒడిబియ్యం, మంగళద్రవ్యాలు, స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. నగరసంకీర్తన పేరిట మంగళవాయిద్యాల మధ్య ఆయా ద్రవ్యాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. బాలబ్రహ్మేశ్వరుడికి పట్టు వస్త్రాలను, అమ్మవారికి చీరా సారే అందజేశారు. సామూహికంగా లలిత సహస్ర నామాపారాయణాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం శాంతినగర్ పట్టణ అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ సాయిబాబా ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోవర్ధన్, అనిత పాల్గొన్నారు.


కలుకుంట్ల ఆలయంలో పాల్గొన్న భక్తులు


అయిజలో సాయిబాబా ఆలయంలో..

కంది సాగు విస్తరణకు కృషి


శాంపిల్ కిట్స్‌ను అందజేస్తున్న అధికారులు

అలంపూర్: ప్రభుత్వం కంది సాగు విస్తరణకు కృషి చేస్తోందని ఏడీఏ సక్రియానాయక్ అన్నారు. పట్టణంలోని ఏడీఏ కార్యాయంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులకు ఉచితంగా కంది విత్తనాలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కంది సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందజేస్తుందన్నారు. రైతులకు పీఆర్‌జీ-176 రకం, ఎల్ఆర్‌జీ-52 రకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అలంపూర్ మండలానికి 250 మినీ కిట్లు ఒక్కొక్క ప్యాకెట్‌లో 4 కేజీలు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఏఓ అనిత, ఏఈఓ శిరిష, రైతులు తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని మద్దూరు, కొర్విపాడు, ఏ.బుర్దిపాడు తదితర గ్రామాల రైతులకు సోమవారం ఏఓ సుబ్బారెడ్డి ఉచితంగా కందులు పంపిణీ చేశారు. పట్టాదారు పుస్తకం జిరాక్స్ తీసుకొని రావాలని ఆయన సూచించారు.

శాంతినగర్: కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రాధ అన్నారు. సోమవారం వడ్డేపల్లి వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులకు కంది విత్తనాలను అధికారులతో కలిసి ఆమె పంపిణీ చేశారు. పీఆర్‌జీ 176 రకం 200 మినీ కిట్స్, ఎల్ఆర్‌జీ 60, డబ్ల్యూఏఆర్‌జీ రకం 10 మినీ శాంపిల్ కిట్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు


షేక్‌షాబీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురంలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోదండాపురం గ్రామానికి చెందిన షేక్ షాబీ కి మూడేళ్ల కిందట కుడికాలు, చేయికి పక్షవాతం వచ్చింది. దీనికి తోడు మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఈ నెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీయగా ఎలాంటి ఆచూకి లభించలేదు. దీంతో షేక్‌షాబీ పెద్ద కుమారుడు ఖలీల్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఐపై ఎస్పీ ఫిర్యాదు

గట్టు: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన దళితుడు జాన్ సోమవారం గట్టు ఎస్ఐ పవన్‌కుమార్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. గ్రామంలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం విషయంలో ఎస్ఐ జోక్యం చేసుకుని తనతో పాటు కుమారుడిని స్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్లను లాక్కున్నారని వివరించారు. కుమారుడిని ఇష్టానుసారంగా కొట్టారని వాపోయాడు. ఈ విషయంపై ఎస్ఐ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా సునంద్ ఫిర్యాదు మేరకు జాన్‌ను స్టేషన్‌కు పిలిపించామని, పెద్దల సమక్షంలోనే పంచాయతీ నిర్వహించామని తెలిపారు.

పాఠశాలలో స్వచ్ఛభారత్

అలంపూర్: మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ హాజరై విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల విస్తారక్ సంతోష్, పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి, నాయకులు నరేష్, మద్దిలేటి, వినీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని చల్లాను కలిసిన నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పెద్ద వెంకట్రాజ, శ్రీను, రాధాకృష్ణలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

అయిజ: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ ఆధ్వర్యంలో వార్డు, బూత్, మహిళా విభాగం కమిటీలను నియమించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో షేక్షావలి మాట్లాడారు. ప్రతి కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ విధానాలను ఎండగట్టాలని కోరారు. నాగశిరోమణి, సులోచనమ్మ, సాంబశివుడు, గాలిరెడ్డి, కార్యదర్శి అహనుమన్న, అధికార ప్రతినిధి మైనర్‌బాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ లాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

గద్వాల అర్బన్: ఈనెల 6వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మె చేపడతుమాని సోమవారం జిల్లా కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చెన్నయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్‌పాషా మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికులకు పర్మినెంట్ చేయాలని, జీఓ నెం.60ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాఘవేంద్ర, హనుమంతు, ప్రభుదాస్, గోవిందు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

గట్టు: మండలంలోని మల్లాపురానికి చెందిన బోయ పార్వతమ్మ ఇటీవల మృతి చెందింది. పీఎంజేజేబీవై బీమాకు పొదుపు ఖాతా నుంచి రూ.436లను చెల్లించడంతో రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాచర్ల సబ్ పోస్టాఫీసులో నామినీ కేశవులకు బీమా చెక్కును ఐపీపీబీ మేనేజర్ గణేష్, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఆంజనేయులు అందజేశారు. సబ్ పోస్టుమాస్టర్లు మధుసూదన్‌రెడ్డి, మురళీమోహన్, సుధాకర్, బీపీఎం, పాల్గొన్నారు.

నివాస గృహాల్లోకి వర్షపు నీరు

అయిజ: పట్టణంలోని 19 వార్డులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చాకలి పేటలో కొన్ని నివాస గృహాల్లోకి వర్షం నీరు చేరుకుంది. డ్రెయినేజీలు నిండి మురుగు ఇళ్ల ముందు ప్రవహించింది. విషయం తెలుసుకున్న పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాస గృహాలను పరిశీలించారు. వాల్మీకి ఆలయం వద్ద డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో సమస్య తలెత్తిందని మడ్డిగుంత కాలనీ ప్రజలు వాపోతున్నారు.

కొట్టుకుపోయిన సర్వీస్ రోడ్డు

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు రోడ్డు మార్గంలో పోలోని వాగుపై గతంలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో దీనిని తొలగించి నూతనంగా బ్రిడ్జి నిర్మించేందుకు వాహనాలను మళ్లిస్తున్నారు. తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి డైవర్షన్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

అధ్యక్షుడిగా వెంకటేష్ ఎన్నిక

గట్టు: మండల కేంద్రంలోని గోపీకృష్ణా ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిణి మన్నేశ్వరి తెలిపారు. గ్రామ పంచాయతీలో ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లను సోమవారం ఆమె స్వీకరించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటుగా సభ్యులకు సంబంధించి ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడిగా గడ్డం వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా గారె రమేష్, కార్యదర్శిగా ఉల్లిగడ్డల వీరన్న, సభ్యులుగా రమేష్, యల్లప్ప, గోవిందమ్మ, ఉలిగమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ప్రక్రియను సర్పంచ్ ధనలక్ష్మి, కార్యదర్శి జగన్నాథరావులు పరిశీలించారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరు కాపులు

గద్వాల అర్బన్: మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం జిల్లా కన్వీనర్ శేషం నర్సింహులు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, గద్వాల మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థులకు హాస్టల్ భవనానికి ఎకర స్థలాన్ని కేటాయించి, రూ.2కోట్ల నిధులు కేటాయించాలన్నారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే నేరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, అనంతరాములు, ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి, పూడురు శ్యామ్, మురళి తదితరులు ఉన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తా


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గద్వాల క్రైం: నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తానని నూనత సీఐ టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని పాత కేసులపై ప్రత్యేక చొరువ తీసుకుని బాధితులకు న్యాయం అందేల చర్యలు తీసుకుంటానన్నారు. నేరాల నియంత్రణకు సిబ్బంది సహకారంతో ముందుకెళ్తానని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిడిలు, దళారీ వ్యవస్థకు తావులేకుండా పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం కలిగేల చర్యలు తీసుకుంటామన్నారు. రాచకోండ పరిధిలోని మల్టీజోన్ - 2లో ప్రస్తుతం పనిచేస్తు సాధారణ బదిలీలో భాగంగా గద్వాల సీఐ వచ్చానని వివరించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ సృజన, డీఎస్పీ రంగస్వామిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ సీఐగా పని చేసిన జి చంద్రశేఖర్‌యాదవ్ మహబూబ్ నగర్ జిల్లా ఉమెన్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

గద్వాల అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం సీఐటీయూ, ప్రజా సంఘాల పోరాట వేదిక, రైతు సంఘం, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో సర్వే చేపట్టామని పేదలకు కనీసం ఇంటి స్థలాలు కూడా లేవని గుర్తించామన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బ్రెడూం ఇళ్ల మంజూరులో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహ్మ, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లే దేవదాసు, నాయకులు ఆంజనేయులు, తిరుపతి, నారాయణ, ఆశన్న, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

బ్రహ్మ గర్జనకు తరలిరండి


బ్రహ్మగర్జన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

జోగుళాంబ శక్తిపీఠం: ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్ వేదికగా నిర్వహిస్తున్న బ్రహ్మ గర్జనకు బ్రాహ్మణులు అధికసంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు సోమవారం బ్రహ్మ గర్జన కమిటీ నిర్వాహక బాధ్యులు అలంపూర్‌కు చేరుకున్నారు. జిల్లా బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మను కలిసి బ్రహ్మగర్జన వాల్ పోస్టర్లు, కరపత్రాలు అందజేశారు. బ్రాహ్మణుల అస్తిత్వం, ధర్మపరిరక్షణ, న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం సభ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం ఆలయంలో అమ్మవారి, స్వామి వారిని దర్శించుకుని అర్చకులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి.అనిల్‌కుమార్, సూరిజయతులసీ చంద్రశేఖర్, లోకావాణి ఉన్నారు.

ఆధ్యాత్మికతతో నైతిక విలువలు


ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తులు

గట్టు: ఆధ్యాత్మికతతో నైతిక విలువలు పెంపొందుతాయని గుడికల్ పీఠాధిపతి గురుగాజీ హుస్సేన్ స్వామి అన్నారు. ఆదివారం రాత్రి ఆరగిద్దలో అల్లీపీరా స్వాముల వారి ఆరాధన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని ఆధ్యాత్మిక చింతనతోనే దూరం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా జీవించాలన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన వైపు బాటలు వేయాలన్నారు. భక్తి గీతాలాపన, భజన, ఉపన్యాస కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

వానలు కురవాలని శివలింగానికి జలాభిషేకం


తుంగభద్ర నది నుంచి శివాభిషేకం కోసం నీటిని తెస్తున్న గ్రామస్తులు

రాజోళి: మండలంలోని తుమ్మలపల్లె గ్రామ నందీశ్వర ఆలయంలో సోమవారం రైతులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవాలని, పంటల బాగా పండాలని కోరుతూ శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ, మహిళలు రైతులు పెద్ద ఎత్తున తుంగభద్ర నది నుంచి బిందెలతో నీళ్లను తెచ్చి శివుడికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఇర్కిచేడుతండా పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. మన-ఊరు మన బడి పనులపై ఆరా తీశారు. ఆయన వెంట హెచ్‌ఎం స్వామి, ఎలీషా, రాజు, సీఆర్‌పీ యుగందర్, పాపయ్య ఉన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

అలంపూర్: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ అశోక్ కుమార్ హెచ్చరించారు. మున్సిపాలిటీలోని ప్రైవేటు పాఠశాలలను ఎంఈఓ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. వీరితోపాటు సీఆర్‌పీ ఈదన్న, ఆయా ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన


ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సరిపడ భోజనం వడ్డించలేదు. మొత్తం 25 మంది పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా పాఠశాలకు చేరుకున్నాడు. సమస్యను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలిసి ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాలీచాలని అన్నం వడ్డిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడితో ఆయన మాట్లాడి విద్యార్థులకు భోజనం పెట్టాలని కోరారు. వారు స్పందించి సమస్య పరిష్కరించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు విష్ణుకు వివరణ కోరగా హోటల్ నుంచి భోజనం తెప్పించి విద్యార్థులకు భోజనం అందించామని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బళ్ళారి నీలప్ప అన్నారు. సోమవారం మండలంలోని నీలిపల్లిలో బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్ పథకం, బీమాయోజన కిసాన్ క్రెడిట్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వాసురెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రెడ్డెప్ప, వెంకట్రాములు, ప్రకాష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.